

# 27

# కొన్ని పక్షులు ఎగరగలవు

నిశ్శబ్దమైన టౌన్ గుంటూరు. కదలిక లేని నదిలా ఉంటుంది. కానీ కనబడని అలజడి రహస్యంగా మనల్ని వెంటాడుతున్నట్లుగా తోస్తుంది. "హఠాత్తుగా వైలెంట్‌గా మారిపోగలదీ ఊరు! నీళ్ల అడుగున తిరిగే ఆక్టోపస్‌లా, ఒక ఉద్రిక్తత ఎప్పుడో ఏమరుపాటున తన టెంటకిల్స్ మనపై విసురుతుంది," జెన్నీ (జానకి) నన్ను భయ పెడుతూనే ఉంటుంది. "ఎన్.ఆర్.ఐ.లు, రౌడీ షీటర్లు, మాజీ కమ్యూ నిస్టులు- గుంటూరు ఒక ఫ్రాంకిన్‌స్టైన్" పాతికేళ్లయినా లేని జెన్నీకి ప్రపంచమన్నా, మనుషులన్నా గొప్ప అపనమ్మకం.

ముఖంపై నవ్వును చెరిపేసుకొని, ముఖాన్ని తాళం వేసిన గదిలా, ఏ స్పందనలూ కనిపించనట్లుగా మార్చే శక్తి గల జెన్నీతో నా పరిచయం నాలుగు నెలలే.

'ఫ్లయింగ్ బర్డ్' అనే త్రీస్టార్ రెస్టారెంట్ యజమాని ఈ జెన్నీ. ముచ్చట గొలిపే చిన్న హోటల్ ఇది. కాఫీ షాపు, మొనాలిసా బార్, అందమైన గార్డెన్ మధ్య పర్ణశాలలాంటి 'సూట్లు'- గుంటూరులో 'మోస్ట్ బ్యూటిఫుల్ ప్లేస్'గా ఈ హోటల్‌కు పేరుంది. ఈ హోటల్లో పార్ట్ టైమ్ ఉద్యోగానికి చేరినప్పుడు నన్ను ఎంతగానో ఆకర్షించింది ఈ హోటల్ అందం. జెన్నీ అనే ఈ అద్భుతమైన స్త్రీ.

రాత్రి పదకొండు గంటలకు హోటల్ స్టాఫ్ అంతా రెస్టారెంట్‌లో కలుస్తాం. యజమానితో సహా అందరం కలిసి డిన్నర్ చేయటం, ఇక్కడున్న మంచి సంప్రదాయం. రిసెప్షన్ మేనేజర్ మధుసూదన్, రెస్టారెంట్ మేనేజర్ మోహనన్, మనీ-ఆఫీసర్ దొర ఒక గ్రూపులా తిరుగుతుంటారు. మధుసూదన్ బ్యాచ్‌గా చెప్పుకుంటారు, ఈ ముగ్గుర్నీ కలిపి.

అందరికీ 'హలో' చెప్పి, తన ప్లేటుతో సహా నేను నిలబడ్డ చోటుకు వస్తుంది జెన్నీ. మిగిలిన వెయిటర్లు, స్టూవర్డ్స్, వంటకాలపై మూగుతారు. మధుసూదన త్రయం ఒక మూలకు పోయి, అన్నంతో పాటు జెన్నీని కళ్లతో నంజుకుంటారు. బహుశా జెన్నీ చరిత్రను, లైంగిక పరాజయాల్ని వెయ్యోసారో రెండువేలో సారో చెప్పుకుంటూ ఉండి ఉంటారు.

జెన్నీ నాతో చనువు చూపుతుంది. నాకు దగ్గరగా వచ్చి నా గుండెతో సంభాషిస్తున్నట్లుగా ఉంటుంది. పక్కనే ఇంద్రధనుస్సు సంచరిస్తున్న భ్రాంతి కలుగుతుంది. తనకు నచ్చినవాళ్లతో ఇంత ఇష్టంగానే ఉంటుంది జెన్నీ. మిగిలిన సమయంలో ఎండి పగుళ్లు వారిన తోలుబొమ్మలా మారిపోతుంది.

తన గురించి ప్రచారంలో ఉన్న స్కాండల్స్ జెన్నీకి బాగా తెలుసు. "ఇలాంటి గుసగుసల తమాషాలు పదేళ్లుగా నాకు తెలుసు. నాలుగేళ్లయింది ఈ హోటల్ పెట్టి. అనుమానపు చూపులతో శత్రువును చూసినట్లుగా చూస్తుంది లోకం. ఎవరితోనైనా కాస్త నవ్వు ముఖంతో మాట్లాడితే వాడితో నాకో 'ఎఫైర్' ప్రకటిస్తారు. అట్లా లెక్కబెట్టుకుంటే నాకు వెయ్యి మంది ప్రియులైనా ఉంటారు! బాస్టర్డ్స్," జెన్నీ ముఖంలో అసహనం, కోపం.

"ఒకడో, ఇద్దరో ఇట్లా ప్రియుల వెంట తిరగటం తప్ప అమ్మాయిలకింకేం పనిలేదనా మీ మగవాళ్ల ఉద్దేశం," డిన్నర్ పొడవునా జెన్నీ అట్లా తిడుతూనే ఉంటుంది.

రెస్టారెంట్‌లోంచి అట్లా లాన్‌లోకి నడుస్తాం. పచ్చని లాన్‌పై వెన్నెల మిలమిలా మెరుస్తూ ఉంటుంది. గదుల్లోని లైట్లన్నీ ఆరిపోతాయి. కేబుల్ టీవీ కూడా కట్టేసి, బ్రహ్మాండమైన నిశ్శబ్దంగా మారిపోతుంది హోటల్. ఆ సమయంలో అందమైన పాతికేళ్ల ఈ జెన్నీ తన బతుకు పురాణాల్ని విప్పుతుంది. జెన్నీ కబుర్లలో చాలా రిపిటీషన్ ఉంటుంది. చెప్పటమే ముఖ్యం. నా రెస్పాన్స్ ముఖ్యం కాదు. చర్చిలో పాదరీకి చెప్పుకున్నట్లుగా ఉంటుంది. మనోహర్ (గోరా) గురించి అడగాలని, వాళ్ల పరిచయం గురించి ప్రోబ్ చేయాలని ఉంటుంది. ఆ విషయం ముచ్చటించినప్పుడల్లా తోలుబొమ్మలాంటి జెన్నీ ముఖం రాతిసంచిలా మారిపోతుంది.

మధుసూదన్ చెప్పే జెన్నీ అనఫిషియల్ బయోగ్రఫీ ప్రకారం, మనోహర్, జెన్నీ చిట్టచివరి ప్రియుడు. ఇద్దరి మధ్య పెళ్లిలాంటి తంతు కూడా జరిగి ఉంటుందని అతని అంచనా. జెన్నీ పూర్వగాథలన్నీ తెలిసి గుండె పగిలి ఒక ముసలిదాన్ని పెళ్లి చేసుకున్నాడని అతని వెర్షన్.

"ముప్ఫయ్యేళ్ల ఛోటా రాజకీయ నాయకుడు మనోహర్. సరిగ్గా తనకు రెట్టింపు వయసున్న భారతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ భారతి మాకు నాలుగేళ్లుగా తెలుసు. నెలకోసారి హోటల్ దగ్గరకు వచ్చి గొడవ చేసి వెళ్తుంది. తమ స్థలాన్ని జెన్నీ హోటల్ కోసం కబ్జా చేసిందని గొడవ. ఈ గొడవలోకి మనోహర్ దూరి దీనికో పొలిటికల్ రంగు ఇచ్చాడు. ఇంతలో ఈ పెళ్లి. ఈ పెళ్లితో భారతమ్మ (భారతి) పెద్ద సెన్సేషన్ అయింది. నిజానికి భారతే మా కథానాయిక! జెన్నీ అవుట్ డేటెడ్ స్టోరీ!" ఈ కబుర్లు చెబుతున్నప్పుడు మధుసూదన్ ముఖంలో గొప్ప శాడిస్టిక్ ఆనందం.

దూరం నుండి చూస్తే అదో యుద్ధ సన్నాహంలా ఉంటుంది. చిన్న షామియానా. దానిపై 'భూ రాక్షసుల కబ్జాల నుండి గుంటూరును రక్షించండి,' అంటూ బ్యానర్ వేలాడుతుంటుంది. షామియానా మధ్యలో పరిచిన టార్పాలిన్. ఆ పేటలో ఒకప్పుడు భూ పోరాటం నడిపిన కమ్యూనిస్ట్ నాయకుడు పోతురామయ్య ఫొటో. ఫొటో మెడలో దండ. ఫొటో పక్కనే కూర్చుని నిరాహార దీక్ష చేస్తున్న భారతమ్మ. షామియానా చుట్టూ రెండు వందల దాకా జనం మూగి ఉన్నారు. చుట్టుపక్కల పొగాకు కంపెనీలో పనిచేసే ఆడవాళ్లు, ఇళ్ల దగ్గర ఖాళీగా ఉన్న ఆవారా కుర్రవాళ్లు. వీళ్లందరికీ ముందు సన్నగా, పొడుగ్గా రివటలా ఉన్న యువకుడు గోరా. పెద్ద పెద్దగా నినాదాలు చేస్తున్నాడు. సగం మంది రోడ్డుపై అడ్డంగా పడుకొని రాస్తారోకో కూడా చేస్తున్నారు.

జెన్నీ ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నిస్తోంది. కిచెన్‌లోకి వెళ్లి ఆవేళ్టి మెనూ గురించి చర్చించటం, కారిడార్‌లో నిలబడి తమాషా చూస్తున్న ఇన్‌మేట్స్‌తో కబుర్లు చెప్పటం- చాలా గంభీరంగా ఉండటానికి ప్రయత్నిస్తోంది. నా దగ్గరకు వచ్చి ఇట్లాంటి క్రైసిస్ వచ్చినప్పుడు ఏం చేయాలో మేనేజ్‌మెంట్ పుస్తకాల్లో రాస్తారా అని అడుగుతుంది నవ్వుతూ. మందకొడిగా సాగే ఉద్యమం హఠాత్తుగా పెద్ద ఉప్పెనలా మారుతుంది. నినాదాల శబ్దంతో రోడ్డు మారుమోగుతుంది. ఒకటో రెండో రాళ్లు ఎగిరి వచ్చి, రెస్టారెంటు అద్దాలు భళ్లుమని పగిలిపోతాయి. అంటే పోలీసులు వస్తున్నారని అర్థం. పోలీస్ వ్యాన్ వచ్చే సమయానికి సగం మంది మాయమవుతారు. గోరా (మనోహర్) మైకు తీసుకొని, ఉపన్యాసం మొదలుపెడతాడు.

ఎస్.ఐ. జెన్నీ స్నేహితుడే. ఇద్దరూ లాన్‌లో కూర్చుని కాఫీ సిప్ చేస్తూ బయట హడావిడిని చూస్తూ ఉంటారు. గోరాని గొంతు నొప్పి పుట్టేదాకా అరవనిచ్చి లోపలకు పిలుచుకురమ్మని కానిస్టేబుల్‌ని పంపుతాడు. ఎస్.ఐ. దగ్గరకు రాగానే ప్రేమగా భుజంపై చేయి వేసి పక్కకు నడిపించుకువెళ్లి, "లంజాకొడకా! మక్కెలిరగదంతాను వేషాలు వేస్తే! జెన్నీ ఒక వెయ్యి ఇస్తది. అది తీసుకుని మీ గుంపుతో సహా ఇక్కణ్నించి వెళ్లిపో," అంటూ ఆర్డర్ పాస్ చేస్తాడు. క్రమంగా గోరా, ఆ గుంపు ఫేడౌట్ అవుతారు. ఆ సాయంకాలం ఎస్.ఐ. మాకు ప్రియమైన అతిథిగా మిలిపోతాడు (జెన్నీకి కూడా)!

"భారతి - గురించి చెప్పు," అని మధుసూదన్‌ని అడిగాను.

"జెన్నీనే అడక్కపోయావా? మేడమ్ ఈ మధ్య నీతో బాగా క్లోజ్‌గా ఉంటోంది," అన్నాడు. మధుసూదన్ ముఖంలో అసూయ.

"మధుసూదన్ అనే బయోగ్రాఫర్ ఉండగా వాళ్లనీ వీళ్లనీ ఎందుకు అడగటం? నువ్వు చెబితే అది చరిత్ర పాఠమంత కరెక్టుగా ఉంటుంది," అంటూ కవ్వించాను.

"ఆమె గురించి చెప్పుకోవడానికేమీ లేదు. మామూలు గృహిణి. వాళ్ల నాన్న గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. చాలాసార్లు జైలుకు వెళ్లాడు. ఈ పేట చివరలో ఆయన శిలావిగ్రహం కూడా ఉంది. ఈవిడకు పెద్దగా రాజకీయాలు కూడా తెలియవు. విడో. ఇద్దరు పిల్లలు. కూతురు హైదరాబాద్‌లో ఉంది. అల్లుడు కాలేజీ లెక్చరర్. కొడుకు ఈ ఊళ్లోనే బ్యాంక్ ఉద్యోగి. కోడలు ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తుంది. చిన్న ఇల్లు. ఒంటరి జీవితం. ఏ ఇబ్బంది లేకుండా బతికే ఆమెను, కొడుకు ఈ గొడవలోకి తోశాడు. జెన్నీ ఈ స్థలంలో హోటల్ కట్టక ముందు అదో పాడుబడ్డ స్థలం. హోటల్‌కు కాస్త పేరు వచ్చినాక, ఆ స్థలం హిస్టరీని వెలికి తీశాడు ఆమె కొడుకు. 'జనం అందరూ కలిసి తాతగారికి ఇచ్చిన స్థలం ఇది! అదొక మాన్యుమెంట్! అక్కడ హోటళ్లు, క్లబ్‌లు పెడితే ఊరు కుంటామా?' అని గొడవ మొదలుపెట్టాడు.

"నాకింకా గుర్తు! భయం భయంగా హోటల్‌కు వచ్చి జెన్నీ ముందు దీనంగా నిలబడి, 'పిల్లవాడు గొడవ చేస్తున్నాడు! ఈ స్థలం వాళ్ల తాతగారిదని! వాణ్ణి పిలిచి ఎంతో కొంత ముట్టజెప్పు' అని బతిమిలాడేది. జెన్నీ పొగరుగా 'నో' అనేది. ఒక్కోసారి నలుగు రైదుగురు పెద్ద మనుషులు వచ్చేవాళ్లు. జెన్నీ వాళ్లను రెస్టారెంట్‌లోకి తీసుకెళ్లి, కబుర్లతో, కాసిన్ని నవ్వులు కలిపి లంచ్‌తో సహా వడ్డించి- వాళ్లను వెనక్కు పంపేది.

"ఎంటర్ ది డ్రాగన్‌లాగా గోరా సీన్‌లోకి వచ్చాడు. (మనోహర్‌కున్న పాపులర్ నేమ్, గోరా) అతని రాకతో రంగస్థలం రూపమే మారిపోయింది. ఇదో ఉద్యమరూపాన్ని తీసు కొంది. దీనికి 'స్వాతంత్ర్య పోరాటం', 'జాతీయ సంపద' లాంటి పదాలతో ఒక ఇమేజి తెచ్చి జనాన్ని మొబిలైజ్ చేశాడు గోరా!

"కొన్నాళ్లు గోరాని కూడా మానేజ్ చేసింది జెన్నీ. హోటల్‌లో జెన్నీ 'అఫీషియల్ లవర్'గా వెలిగిపోయాడు గోరా.

"జెన్నీ మేడమ్‌కు ఈ ఊళ్లో చాలామంది మగస్నేహితులున్నారు. ఒట్టి స్నేహం, చనువే అంటారు కొంతమంది. ఎఫైర్లు ఉన్నాయంటారు చాలామంది. నిజం జెన్నీకే తెలియాలి. మేడమ్ ఫ్రెండ్సులో ముఖ్యమైనవాడు అనిల్. కంప్యూటర్ ఇంజనీర్! ఒకరోజు అనిల్ బర్త్‌డే మన రెస్టారెంట్‌లో సెలబ్రేట్ చేస్తుండగా, గోరా తాగివచ్చి గొడవ చేశాడు. మేడమ్ గురించి చాలా అసహ్యంగా మాట్లాడాడు. వాచ్‌మెన్‌తో చెప్పి బయటకు గెంటిం చింది మేడమ్. ఆ తరువాత వారానికి భారతితో గోరా పెళ్లి!

"సింపుల్ లుకింగ్, ఇన్నోసెంట్ ఓల్డ్ లేడీ. దిగులుగా, ఒంటరిగా అనిపించే ముఖం. భారతికే కాదు, ఆ వయసులో ఉన్న చాలామంది సమస్య, ఒంటరితనాన్ని ఎదుర్కోవటం. కొడుకులు, కూతుళ్లు, మనవలు ఎవరి లోకం వాళ్లది, ఎవరి సంపాదన వాళ్లది. ఎవరి కాలక్షేపం వాళ్లది. ఒంటరి గుహల్లాంటి వీళ్లకు ఏదో ఒక ఆసరా! భుజం ఆన్చుకోవడానికి, దు:ఖం పంచుకోవడానికి- ఒంటరితనం క్రమంగా వ్యాధిలా మారి ఇట్లాంటి నిర్ణయాలు తీసుకుంటారు.

"స్త్రీలకు ఒక మొగుడు, ఒక ప్రియుడు మించి ఉండటం ఇష్టపడని కన్సర్వేటివ్ వాతావరణం మనది. భారతికి ఈ పెళ్లే పెద్ద శిక్ష అయింది. చుట్టుపక్కల ఇళ్లవాళ్లు మాట్లాడటం మానివేశారు. కొడుకులు, కూతుళ్లు తిట్టిపోసి, దాదాపు ఆమెను చంపినంత పనిచేశారు. ఇవాళ ఆవిడో సోషల్ అన్‌టచ్‌బుల్. విచిత్రంగా ఒక్క జెన్నీనే ఆమెను ప్రేమగా పలకరించేది.

"ఆదివారం సాయంకాలం పూట గొప్ప దృశ్యం ఎదురౌతుంది. భారతి ఒక్కతే రెస్టారెంట్‌కు వస్తుంది. జెన్నీ కాఫీ, స్నాక్స్ తీసుకొచ్చి ఆమెకు వడ్డిస్తుంది. ఎదురుగా కూర్చుని కబుర్లు చెబుతుంది. ముసలిదాన్ని ట్రాప్ చేస్తోందని అంటారుగానీ, జెన్నీ మాత్రం లవింగ్ ఫ్రెండ్‌లాగే ఆమెతో మాట్లాడుతుంది.

"మరి గొడవలు, ధర్నాల మాటంటావా? అది భారతి చేతిలో లేదు. గొడవల న్నింటికీ సూత్రధారి గోరా. యుద్ధం జెన్నీకి, గోరాకి మధ్య. భారతి ఒట్టి ప్రేక్షకురాలు."

మధుసూదన్ బయోగ్రఫీలో నిజం పాలు ఎంతో తెలీదుగానీ, వింటానికి అదో రొమాంటిక్ స్టోరీలా ఉంది.

i

ఒక ఉదయం హోటల్ కౌంటర్లు ఇంకా తెరవకముందే జెన్నీ నా దగ్గరకు వచ్చింది. నిద్రలేని ముఖం. చాలాసేపు దు:ఖించిన కళ్లు, "రాజ్! కాసేపు నీతో మాట్లాడాలి," అంది ఉపోద్ఘాతం లేకుండానే. చర్చి ఫాదరీలాగా గంభీరంగా మార్చుకున్నాను నా ముఖాన్ని.

"రాత్రి మనోహర్ నా గదికి వచ్చాడు. చాలాసేపు గొడవ చేశాడు. కలిసి ఉందాం అని విసిగించాడు."

"మనోహర్ రాత్రి గొప్ప దు:ఖాన్ని నటించాడు. నిరుద్యోగం, ఆకలి, సమాజంపై కోపంతో భారతిని పెళ్లి చేసుకున్నాడట. బాగా తాగిన ఒక దు:ఖపు రాత్రి, ఆవిడ ఒడిలో తల పెట్టుకొని ఏడ్చాడట! ఆమె ఓదార్పు ఒక లైంగిక అనుభవంగా దారితీసిందట! అందుకే భారతిని పెళ్లిచేసుకున్నాడట!

"భారతిని పెళ్లి చేసుకోవటం ద్వారా ఈ సమాజం ముక్కుపై డబ్‌మని గుద్దిన ఆనందం వేసిందట. నాలుగు నెలలు అయ్యాక, ఇప్పుడా కసి తగ్గి, జనంలోకి వెళ్లాలంటేనే భయమట!"

"తాగి గది నిండా వాంతి చేసుకున్నాడు. వాచ్‌మెన్ సాయంతో బలవంతంగా బయటకు పంపించాల్సి వచ్చింది."

జెన్నీ ముఖం ఎర్రగా ఉంది. కళ్లలో కోపపు జీరలు. "జీవితమంతా ఈ మనోహర్ నన్ను వెంటాడుతూనే ఉన్నాడు. బహుశా నా చావే అతనికి సుఖాన్ని కలిగిస్తుందేమో!" జెన్నీ ముఖం కఠినంగా మారిపోయింది.

"చిన్నతనంలో స్కూలు లేకపోతే ఎంత బాగుండు అనుకునేదాన్ని! బంద్ జరిగో, ఎవరన్నా చనిపోయో స్కూలు మూసివేస్తే ఎంత బాగుండో అని ఎదురుచూసేదాన్ని. ఒకసారి వారం రోజులపాటు స్కూలు మానెయ్యమని అమ్మ అడిగింది. ఏనుగు ఎక్కినంత సంబరం! అయితే వారం అనుకున్నది, నెలలు, సంవత్సరమూ అయింది. ఎప్పటికీ స్కూలుకెళ్లలేని పరిస్థితి. నాన్న హఠాత్తుగా ఇల్లు వదిలి వెళ్లాడు. కారణాలు అమ్మ చర్చించలేదు. ఇద్దరిదీ కులాంతర వివాహం. ఆ చిన్న పల్లెటూరిలో నాన్నను అందరూ సాంఘిక హింసకు గురిచేశారు. చాటుగా వెక్కిరించేవాళ్లు. ఎదిరించి నిలబడే ధైర్యం అతనికి లేకపోయింది. అయన వెళ్లిపోయిన సంవత్సరం తరువాత అమ్మ, ఇంటి ముందు గదిని, చిన్న హోటల్‌గా మార్చింది. ఊరంతా నివ్వెరపోయి చూసింది. వక్రపు చూపులు, చాటుమాటు గుసగుసలు. అమ్మ పట్టించుకోలేదు.

సంవత్సరం ఆగి మళ్లీ స్కూలుకెళ్లాను. లక్ష ప్రశ్నల కత్తులు. వందలాది సందేహాల చూపులు.

కుల సంకరము వలననే కాబోలు నన్ను అందరూ 'జెన్నీ' అని పిలిచేవాళ్లు. 'జెన్నీ' ఒక తిట్టు అని, అవమానకరమైన టీజింగ్ అని నాకు మొదట్లో అర్థమయ్యేది కాదు.

అర్థమైనాక కసితో రిజిస్టర్‌లో నా పేరు 'జానకి' అని కాక, 'జెన్నీ' అని మార్పించుకున్నాను.

మా ఇంటికి రెండిళ్ల అవతల మనోహర్ అనే కుర్రవాడు ఉండేవాడు. వాళ్ల నాన్న లెక్కల టీచర్. ఆయన దగ్గరికే ట్యూషన్‌కు వెళ్లేదాన్ని నేను. ఈ మనోహర్ చాన్నాళ్లు ఆర్.ఎస్.ఎస్. మెంబర్‌గా ఉండేవాడు. ఖాకీ నిక్కర్, కాషాయపు బొట్టు, లాఠీకర్ర. వింతగా ఉండేవాడు మనోహర్. పిలక పెంచుకోవటం కూడా అతనికెంతో ఇష్టం.

అతనికి నేనన్నా, మా అమ్మ అన్నా ఎందుకో చాలా కోపం. అసహ్యం!

నన్ను చూడగానే కళ్లలో నిప్పులు పోసుకునేవాడు. సాధ్యమైనంతవరకూ నావైపు ముఖం తిప్పకుండా ఉండాలని ప్రయత్నించేవాడు. పొరపాటున నా పక్కన కూర్చోవాల్సి వస్తే, ముళ్లపై కూర్చున్నట్లుగా కూర్చునేవాడు. టాగోర్ నవల 'గోరా' చదివినప్పుడు ఈ మనోహరే గుర్తుకొచ్చేవాడు. అతనికి 'గోరా' అని నిక్‌నేమ్ ఖాయం చేశాం క్లాసులో. ఎప్పుడూ చిరాగ్గా, కోపంగా ప్రపంచమంతా భ్రష్టమైపోతుందని బాధపడే ఈ గోరాయే, అమ్మ గురించిన పుకార్లను స్కూల్లో ప్రచారం చేయటం మొదలుపెట్టాడు. నేను విననట్లుగానే

తేలిగ్గా కొట్టివేసేదాన్ని. స్కూలు గోడలపై, బోర్డులపై, ఊళ్లో దేవాలయంపై కూడా రాతలు ఎక్కించాడీ గోరా. అమ్మ దు:ఖంతో, భయంతో పాలిపోయేది. ఇల్లు అమ్మి ఎటైనా వెళ్లి పోదామని ఏడ్చేది. 'ఎటు పోయినా ఈ 'గోరా'లు లేకుండా ఉంటారా? ఎంత దూరమని పారిపోవటం?' అని వాదించాను.

అప్పుడు నేను టెన్త్ క్లాస్. పట్టుబట్టి పరీక్షలని ఒక యుద్ధంలా భావించి చదివాను. గోరాపై మొదటి విజయం. టెన్త్‌లో నాకు ఫస్ట్ క్లాస్ వచ్చింది. గోరా కన్నా యాభై మార్కులు ఎక్కువ. రిజల్ట్స్ వచ్చిన రెండు వారాల్లో గోరాపై రెండో విజయం కూడా సాధించాను. ఒక సాయంకాలపు గోధూళి సమయంలో, మామిడి తోటలో గోరా ఒంటరిగా దొరికాడు. గోరా నిష్ఠగా భావించుకొనే అతని బ్రహ్మచర్యంపై దాడి చేశాను. గోరాయేం బుద్ధుడు కాడు. సన్నని పెదాలు, నునుపైన బుగ్గలు, బిగువైన వక్షం, పదహారేళ్ల సౌందర్య బాణం నుండి తప్పించుకోలేకపోయాడు. మరుసటిరోజు నుండి గోరాకు ఆర్.ఎస్.ఎస్. డ్రిల్ లేదు. గాయత్రి లేదు. ఒక పెనుతుఫానులో చిక్కినవాడిలా అల్లల్లాడిపోయాడు.

ఆ సెలవుల్లో ఇల్లు అమ్మి, ఆ డబ్బుతో గుంటూరులో చిన్న ఇల్లు కొనుక్కున్నాం. ఆ ఇంట్లోనే చిన్న హోటల్ కూడా మొదలుపెట్టాం. కాలేజీలో చేరానేగాని, చదువుపై ఆసక్తి కలగలేదు. ఒక జీవితం ముగిసినట్లుగా నింపడానికి ఏమీ మిగలని పాత్రలా అయ్యిందని పించేది. ప్లస్ టూ అతి కష్టం మీద పాస్ అయ్యాను.

అప్పట్లోనే 'ఫ్లయింగ్ బర్డ్' హోటల్ గురించిన స్వప్నం నాలో మొలకెత్తింది. ఉన్న ఇంటిని, స్థలాన్ని అమ్మి బ్యాంక్ చుట్టూ తిరిగి, రెండు లక్షల లోన్ సంపాదించి, ఈ హోటల్ కట్టగలిగాను. మొదట్లో ఇది ఒట్టి రెస్టారెంట్! అనిల్ అనే కంప్యూటర్ ఇంజనీర్, ఒకసారి రెస్టారెంట్‌కు వచ్చాడు. రెస్టారెంట్ అందాన్ని చూసి థ్రిల్ అయ్యాడు. 'ఇది రెస్టారెంట్‌లా లేదు. డ్రీమ్‌హౌస్‌లా ఉంది. దీన్ని ఎక్స్‌టెండ్ చేయండి. ఫైనాన్స్ నేను చేస్తాను. గుంటూరుకు మనిద్దరం కలిసి అందమైన గిఫ్ట్ ఇద్దాం,' అంటూ ముందుకు వచ్చాడు. పదిలక్షల దాకా పెట్టుబడి పెట్టాడు. 'ఫ్లయింగ్ బర్డ్' రూపొందింది, గొప్ప చిత్రకారుని పెయింటింగ్‌లా! దీన్ని రూపొందించింది నేనేనా అని నాకు ఆశ్చర్యం వేస్తుంది అప్పుడప్పుడూ. సేల్స్ పెరిగాయి. ఇదో టూరిస్ట్ ఎట్రాక్షన్ అయ్యింది.

హోటల్‌లో ఒకరోజు గోరా కనిపించాడు. బార్‌లో ఎవరితోనో గొడవ పడుతున్నాడు. ముందు గుర్తుపట్టలేదు ఆ మనిషిని. ముఖంపై దట్టంగా పెరిగిన గడ్డం, ఎర్రబారిన కళ్లు, పీలగా, ఎముకలు పొడుచుకు వచ్చిన దేహం, శిథిలగృహంలా ఉన్నాడు.

నన్ను చూసి అతని ముఖం విప్పారింది. నాపై ఎంతో అధికారం ఉన్నవాడిలా ప్రవర్తించాడు, ఉద్యోగం లేదట. టౌన్ రాజకీయాలు, సింగిల్ నెంబర్ లాటరీలు, షేర్ మార్కెట్ బ్రోకరేజి - అదీ జీవితమట. కనిపించిన మొదటిరోజే డబ్బు కావాలని పోరాడు. రెండు రోజుల పస్తట. పాడైపోయిన లివరుకు తప్పనిసరిగా వాడాల్సిన మందు కోసం కూడా డబ్బు కావాలిట.

ఎందుకో అతన్ని చూసి దిగులు వేసింది. దగ్గరకు తీసుకొని ఓదార్చాలనిపించింది. పొగరు, అహం నశించి అతనిలో ఒక మనిషి పుడుతున్నాడనిపించింది. అతనికి నాపై కావలసినంత అధికారాన్ని, చనువును ఇచ్చాను.

ప్రపంచాన్ని ద్వేషంతోను, కోపంతోను కాక ప్రేమించే మనసుతో చూడటం అలవాటు చేసుకొన్న నాకు, ఎటు చూసినా స్నేహితులే, ప్రతి మలుపులోనూ ఒయాసిస్సులే. ఒదిగి ఒదిగి సిగ్గులు చిందించే పాత తరపు స్త్రీని కాను నేను. ప్రపంచాన్ని జయించాలని కలలు కనే నేటి స్త్రీని. నీకు మగ స్నేహితులేమిటి? అని నొసలు విరుస్తాడు గోరా. అలా విరగబడి సముద్రంలా నవ్వొద్దు అంటాడు. అట్లా పూలు విరగగాసిన చెట్టులా ఎవడి భుజంపైనో వాలిపోవద్దు అంటాడు. ఇట్లాంటి శాసనాలంటేనే నాకసహ్యం! గోరాకి వివరించినా అర్థం లేదు. గొడవ పెట్టుకొని తనకు తానే దూరమైనాడు."

చెప్పటం పూర్తయ్యేసరికి జెన్నీ ముఖం నిండా దిగులు నీడ. ప్రేమగా చేతిని నొక్కాను. "నథింగ్ టూ వర్రీ. ఇటీజ్ ఎ బాడ్ డ్రీమ్," అన్నాను ఓదార్పుగా.

i

రాత్రి డ్యూటీలు ముగించుకొని మెల్లమెల్లగా అందరం రెస్టారెంట్‌లోకి చేరాం. జెన్నీ పట్టుచీరలో ఆకుపచ్చ దీపంలా ఉంది. మధుసూదన్, 'జానే కహా! గయే వోదిన్,' అంటూ మలయాళ యాసలో ముఖేష్ పాటను హమ్ చేస్తున్నాడు. మోహనన్నా జెన్నీ దగ్గరకు వెళ్లి, ప్లేటు ఆఫర్ చేసి, "షల్ ఐ గెట్ సమ్ ఫుడ్," అన్నాడు ప్రేమగా.

జెన్నీ వద్దంటూ 'సూప్' మాత్రం తీసుకుంది. జెన్నీ ముఖంలో నీలినీడలు. "వెల్ బాయ్స్! దేర్ ఈజ్ ఎ బ్యాడ్ న్యూస్ ఫర్ అజ్," అంది. అందరం కంగారుపడ్డాం. "హోటల్ స్థలం గురించిన గొడవ కొత్త మలుపు తిరిగింది. భారతితో కోర్టులో కేసు వేయించాడు గోరా. స్వాతంత్ర్యయోధుడి స్థలమని, నేషనల్ హెరిటేజ్ కావలసిన స్థలాన్ని, హోటల్ కోసం కబ్జా చేశామని వాళ్ల వాదన. వాళ్లవైపు కేసు బలంగా ఉంది. లెట్ అజ్ ప్రిపేర్ ఫర్ ది వర్స్ట్," జెన్నీ గొంతులో దిగులు జీర. అంతలోనే సర్దుకొని, "ఎనీ హౌ! ఇవాల్టికి హుషారుగా, ఖుషీగా ఉందాం! దు:ఖాన్నీ దిగులునీ రేపటికి వాయిదా వేద్దాం," అంటూ జెన్నీ రెస్టారెంట్ లోంచి వెళ్లిపోయింది. అందరికీ తిండి వంటబట్టలేదు. గదంతా దు:ఖపు గుసగుసలా మారిపోయింది.

హోటల్ సందడి క్రమంగా సద్దుమణుగుతుంది. దీపాలన్నీ ఒంటరిపాటలైనాయి.

రిసెప్షన్ కౌంటర్‌కు బయట ఉన్న మెట్ల దగ్గర ఒక పొడవాటి మనిషి- కూనిరాగాలు తీస్తూ, వాచ్‌మెన్ వెళ్లమని, అతన్ని బెదిరిస్తున్నాడు. "జెన్నీ వస్తేనే వెళతాను. జెన్నీతో కలిసే వెళతాను," అని పెద్దగా అరుస్తున్నాడు. అతను మనోహర్ ఉరఫ్ గోరా.

"జెన్నీ రా. నీ గోరా దగ్గరకు రా.

గోరా అంటే అడ్వెంచర్! గోరా అంటే ప్యారడైజ్!

గోరా అంటే నీ ఆత్మని తట్టిలేపే పాట!
చిటికెడు విస్కీ, గుప్పెడు మల్లెలు, జేబులో కామసూత్ర పక్కన గోరా-
ఆత్మలను వెలిగించే సాధనాలు ఇవే!
ఆత్మకోసం రోదించు జెన్నీ! ఆత్మకోసం!"

పెద్దపెద్దగా అరుస్తున్నాడు మనోహర్! రూములోంచి జనం బయటకు తొంగి చూస్తున్నారు. జెన్నీ కూడా బయటకు వచ్చింది. నన్ను పిలిచి, "అతన్ని మెల్లగా బయటకు పంపించు" అని కోరింది.

పాడవాటి నీడలా, నడుస్తున్న విషాదంలా ఉన్నాడు మనోహర్! దగ్గరకు వెళ్లి భుజంపై చెయ్యి వేసి, "రండి! అట్లా లాన్‌లోకి వెళ్లి మాట్లాడుకుందాం" అంటూ లేవదీశాను.

"బయటకు గెంటిస్తారా?" కోపంగా అరిచాడు మనోహర్.

"నో! నెవర్! మీరు మాకు చాలా ఆప్తులు. మిమ్మల్ని కంఫర్ట్‌గా చూసుకొమ్మని మేడమ్ ఆర్డర్. రండి. అట్లా వెళదాం," అంటూ లేవదీశాను.

"ఒక తాగుబోతు వెధవలా, ఆకు రౌడీలా కనిపిస్తున్నానా మీ కంటికి?" క్షణంసేపు ఆగి, నావైపు తీక్షణంగా చూస్తూ అడిగాడు మనోహర్. "మీరో ఫిలాసఫర్‌లా, పొయెట్‌లా కనిపిస్తారు. మీరో గొప్ప క్యూరియాసిటీ నాకు," అన్నాను, అతన్ని పొగుడుతూ.

లాన్‌లో నడుస్తూ నడుస్తూ హఠాత్తుగా ఆగి, "నన్ను ఫిలాసఫర్ అన్నారు కదూ. మీకు పొగడటం కూడా రాదు. రేపు ఉదయానికి నన్నో హంతకుడిగా చూస్తారు. అప్పుడు నన్ను రివల్యూషనరీ అని పొగుడుతావా మేనేజర్," అంటూ పెద్దగా నవ్వసాగాడు మనోహర్.

"మిస్టర్ మేనేజర్! రేపటి ఎగ్జయిటింగ్ న్యూస్‌ని ఇవాళే చెబుతున్నాను. విను. నా జేబులో ఎత్తుగా కనిపిస్తున్నవేమిటనుకున్నావు. బాంబులు. కంట్రీమేడ్ బాంబులు. ఐయామ్ కిల్లింగ్ జెన్నీ. జెన్నీకి ఇక రేపు లేదు. యూ నో! జెన్నీ ఒక పాయిజనస్ డ్రీమ్. మెదడును చంపేస్తుంది. ఆలోచనను చంపేస్తుంది. సిగ్గును చంపేస్తుంది. పురుషజాతిని కొద్దికొద్దిగా చంపటమే ఈ జెన్నీల లక్ష్యం. నాజీల గురించి విన్నారు కదూ! ఇదోరకం నాజీయిజం! జెన్నీయిజం!" మెల్లగా నిద్ర కమ్ముతున్నట్లుగా ఉంది మనోహర్‌కి. కలవరింతలాగా మాట్లాడు తున్నాడు. మత్తుగా అట్లాగే లాన్‌పై కూలిపోయాడు. అతన్ని బయటకు తీసుకెళ్లి రిక్షా ఎక్కించమని వాచ్‌మెన్‌కి చెప్పాను.

i

ధన్‌ధన్‌మంటూ పెను విస్ఫోటన శబ్దం విని అందరం ఉలిక్కిపడి లేచాం వేకువ జామున. 'బాంబులు! బాంబులు!' హోటల్ అంతా కేకలు, అరుపులు! రెస్టారెంట్, రిసెప్షన్ కౌంటర్ కూలిపోయాయి. రెస్టారెంట్ కప్పుతో సహా కూలిపోయింది. రెస్టారెంట్‌కు దగ్గరగా

ఉన్న రెండు ఏసీ సూట్లు కూడా కూలిపోయాయి. కూలిన గోడలు, చిందరవందర అయిన సామాను రిసెప్షన్ గదిలో లేచిన మంటలు- భయంకరమైన దుఃస్వప్నంలా ఉంది. ఫైర్ ఇంజన్, పోలీస్‌వ్యాన్, వందలుగా మూగిన ఊరి జనం, యుద్ధభూమిలా ఉంది వాతావరణం. మంటలు ఆర్పుతుండగా, రెస్టారెంట్ పక్కన కాలి, మాంసపు ముద్దలా పడున్న మనిషి శరీరం. 'మనోహర్!' పాలిపోయిన ముఖంతో భయంగా అరిచింది జెన్నీ.

మనోహర్ శరీరాన్ని మార్చురీకి తరలించారు. శిథిలాల్ని తొలగించే కార్యక్రమం చాలసేపు పట్టింది. మనోహర్ తప్ప మరే ప్రాణనష్టం జరగలేదు.

"మై డ్రీమ్స్ వర్ కిల్డ్! నా కలలు చచ్చిపోయాయి!" అంటూ జెన్నీ పదేపదే నుదుట పై బాదుకుంది. జెన్నీని ఓదార్చటానికి మాటలు దొరకలేదు. శిథిలాల మధ్య కనపడే మరో హృదయవిదారక దృశ్యం భారతి. అక్కడే కూలబడి గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది మనోహర్ కోసం.

i

జూలై నెల, సమ్మర్ మాసాల కొనసాగింపులా ఉంది. హోటల్ స్టాఫ్‌నంతా పిలిచి మీటింగ్ ఏర్పాటుచేసింది జెన్నీ! ముఖం నిండా విషాదకరమైన ప్రశాంతత!

"థాంక్యూ ఫర్ ఆల్ ది ఇయర్స్! అందరికీ మూడు నెలల జీతం ఇస్తున్నాను. లాంగ్ గుడ్ బై టూ ఆల్!" అంటూ అందరికీ పేరుపేరునా షేక్‌హ్యాండ్ ఇచ్చింది.

మధుసూదన్ బుగ్గపై ముద్దుపెట్టి సన్నగా కన్నుగీటి, "నా వెయ్యిన్నొక్క ప్రియుడివిగా ఉంటావా?" అంది. మధుసూదన్ ముఖంలో రిలీఫ్‌తో కూడిన సన్నని నవ్వు.

జెన్నీ నా జేబులో ఒక కవరు పెట్టింది. అందమైన గ్రీటింగ్. నా కళ్లలో నీళ్లు! ప్రేమగా జెన్నీ చేతిని వత్తాను.

"పోరాటం ఆపవద్దు! లెట్ ద బర్డ్ ఫ్లై" అన్నాను.

రూమ్‌లోకి వెళ్లిన తరువాత జెన్నీ ఇచ్చిన కార్డు బయటకు తీశాను. ఒంటరి పూల తీగ. దాని శిగలో ఒకే ఒక పూవు.

"బావురుమంటున్న శిథిలాల మధ్య, ఒకే ఒక ఆశ- అట్లా జీవించే ఉంటుంది! మళ్లీ కలుద్దాం! -జెన్నీ," అని రాసి ఉంది.

*సుప్రభాతం వీక్లీ 1 మార్చి 1998*
*గుంటూరు కథ, 2013*